కథ

# లాస్ట్ మెయిల్

సీతారత్నం

**"అన్నా!... ఫోను... అరడజను సార్లు మోగింది. అంత మొద్దు నిద్ర ఏంటీ, లే" అని సెల్ తీసుకువచ్చి చేతిలో పెట్టింది శిరీష.**

**"చెప్పరా బాబూ..." అన్నాడు మిత్రా.**

**"జయకు జ్వరం. రాదట..."**

**"ఏంటీ? వేషాలేస్తోందా? ప్రోజెక్ట్ అవక్కర్లేదా!" చాలా ఆవేశంగా లేచి కూర్చుని తిట్టడం మొదలెట్టాడు.**

**"ఇలా తిడతావనే నీకు చెప్పలేదు.."**

"నీకు తెలియదా! టైమ్ అయిపోతుందని...." అన్నాడు దిగులుగా

"ఏం చేస్తాం మరీ...!"

"సర్లే నేనే తొందరగా పోతాను. చూస్తాలే.. 9.30కి కస్టమర్ కాల్ఉంది. మోర్గా తినేస్తుంది... ఉంటా...." అని ఫోను పెట్టి ఆలోచనలో మునిగిపోయాడు రెండు నిమిషాలు.

మిత్రా గబగబా బాత్రూమ్కి వెళ్ళి కాలకృత్యాలు ముగించి స్నానం చేసి బయటకు వస్తూనే "అమ్మా కాఫీ... మమ్మీ కాఫీ..." అన్నాడు గట్టిగా.

తువ్వాలు కట్టుకొని డియోడ్రెంట్ వొళ్ళంతా స్ప్రే చేసుకొన్నాడు. కాఫీ పట్టుకొని వచ్చిన చెల్లి "అబ్బబ్బ ఎందుకురా అంతవాడతావు. వాసన చిరాకొచ్చేస్తుంది. నీ జీతం అంతా దీనికే పోతుందేమో!" అంది.

"ఊరుకో ఏ.సిలో చెమట వాసన వస్తే చచ్చిపోతారు. భరించలేక... అయ్యో మరచిపోయా- హాపీ బర్తే డే టూయూ" అని చెయ్యి ఇచ్చాడు.

"సాయంత్రం త్వరగా రా..."

"అబ్బే, కుదరదు" అంటుండగానే"

"దాని పుట్టిన రోజు అనే మేము అంత దూరం నుండీ వస్తే నువ్వు లేకపోవడమేమటిరా..." అన్నాడు మావయ్య.

"బాబూ, నాది నీలా గవర్నమెంట్ ఉద్యోగం కాదు"

"గవర్నమెంటు ఉద్యోగానికి ధరఖాస్తు చెయ్యవు. అపుడే రెండు కంపెనీల్లో ఉద్యోగం మారావు. అర్ధరాత్రి వస్తావు." అంటున్న తల్లి మాటలకి అడ్డుపడుతూ-

"మమ్మీ కడుపులో చల్ల కదలకుండా ఉండాలనుకొనే మీ తమ్ముళ్ళ లాంటి వారి కోసం మాత్రమే గవర్నమెంటు ఉద్యోగాలు..."

"టెన్షన్తో ఏ నరం తెంపుకుంటావో అని భయం..."

"ఏం కాదు. టెన్షన్లో థ్రిల్ ఉంది. టెన్షన్తో వర్క్ చేస్తే అది ఫలిస్తే వచ్చే మజాయే వేరు నన్ను వదిలేయండి" అని గబగబా కాఫీ తాగి కప్పులోపల పడేసి వచ్చి-

"శిరీ....." అని రెండు చేతులు పట్టుకొని ఊపుతూ "చెల్లాయి పుట్టిన రోజూ..." అని పాట మొదలెట్టాడు.

"బాబోయ్, తెలుగు సినిమా అన్న ప్రేమ వద్దు నాయనా..." అని చేతులు విదిలించింది... నవ్వుతూ 5000 రూ. తీసి చేతిలో పెట్టి "కాళ్లకి దండం పెట్టుకో. పెద్దవాడ్ని దీవిస్తా" అన్నాడు.

"పెద్దరికం నీకు వచ్చాక పెడ్తాలేరా"

"అంటే, ఏయ్, ఊరుకొంటున్నాననా? చూడు అమ్మా!"

నవ్వి "ఏవన్నా తిని వెళ్లరా!" అంది తల్లి.

"ఏం వద్దు రాత్రి తింటాను... 9.30కి అక్కడ తింటాలే టిఫిన్.."

"మావయ్యా, వీడికి అక్కడ పెద్ద హోటల్లో నుండి అన్నీ తెప్పిస్తారు" అంది శిరీష

"వాడిపొట్టే చెప్తోంది గదా!"

"మావయ్యా! సిరిబొజ్జ. ఈ జానెడు బొజ్జ కోసమే కదా ఇన్ని పాట్లూ.. దీన్ని ఎవరూ ఏవీ అనకూడదు." అని కుడి చెయ్యి బొజ్జ మీద ప్రేమగా ఆనించి - "530 కి కేక్ వస్తుంది. రాకపోతే ఫోను చెయ్యి... బై... " అంటూ

"మీరు సొల్లు కబుర్లు ఆడుతూ సాయంత్రం దాకా హాపీగా గడపండి" అన్నాడు.

"నిన్ను ఎవరైనా ఉండొద్దన్నారా? ఉండు"

"మోర్గా అరుస్తుంది."

"ఎవరూ"

"నన్ను ఉంచికొందిలే" అని నవ్వి "for the purpose of project only" అన్నాడు.

"అమెరికాలో మా ప్రోజెక్ట్ చూస్తుంది. మమ్మల్ని తరుముతుంటుంది. ప్రతిరోజూ ఎవరు ఏమి చేయాలో మెయిల్లో పెట్టేస్తుంది. అవకపోతే అరుస్తుంది..." అన్నాడు షూ వేసుకొంటూ.

"చెయ్యకపోతే ఏం చేస్తుంది!"

"అమ్మ ఏం చేస్తుంది. పని మనిషిని మాన్పించి ఇంకొకరిని పెట్టుకోదూ... అలాగే...!"

"సెక్యూరిటీ లేని ఉద్యోగాలు..."

"ఆ, ప్రోజక్ అయితే హైక్ వస్తుంది తెలుసా. కనీసం నెలకి 5000 రూ. రెండేళ్ళ బట్టి పేరివిజన్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. పదేళ్ళకి ఇస్తామని 13 ఏళ్లకి ఇస్తున్నారు. మీరు కాబట్టి భరిస్తున్నారు. హైక్ లేకుంటే "this is last mail from me" అని పెట్టేస్తారు మా వాళ్లు. గత నెల దీపక్ గాడికి ఇవ్వలేదు. 25th నాలుగు గంటలకి మెయిల్ పెట్టాడు. "This is last mail Dipak" అని అంతే సాయంత్రం 5.30కి 3000 రూ. హైక్ ఇచ్చానని మా డైరక్టర్ మెయిలిచ్చాడు.. అలావుంటుంది... అని బై చెప్పి వెళ్లిపోయాడు.

***

మిత్రా "హాయ్" అని పలకరిస్తూనే గబగబా తన సిస్టమ్ దగ్గరకి వెళ్లి రోజూలాగే మెయిల్ బాక్స్ వోపెన్ చేసాడు. మోర్గా మెయిల్ ప్రోజెక్ట్లో ఉన్న ఎనిమిది మంది పేర్లు వరసగా కన్పిస్తున్నాయి. ఎదురుగా ఆ రోజు చెయ్యవలసిన పని ఎంత బాగా ప్లేన్ చేస్తోందో! విజన్ ఉంది. స్పష్టత ఉంది. చాలా తెలివైనది అనుకొన్నాడు. ఏ పని చెయ్యాలో స్పష్టంగా ఎదురుగా కన్పడుతుంటే బుద్ధి ఆ దిక్కే పని చేస్తుంది అనుకొంటూ వరసగా చూస్తూ జయ పేరు చూసి గతుక్కుమన్నాడు. బాబోయ్ సెలవు.. ఎలా? అమ్మాయిలంటే ఇదే బాధ ఏదో సెలవు ప్రిగ్నంట్, ఒక నెలా పదిహేను రోజుల నుండీ ఒక రోజు వాంతంటుంది. ఒకరోజు తల తిరిగింది అంటుంది... విసుక్కొంటే అమ్మే ఒప్పుకోలేదు. సమాజం అంతా జయ వెనకే ఉంది అంటాడు ప్రేమ కుమార్. నిజమే, కానీ ప్రోజక్ట్ ఎలా? ఇది మాత్రం నా నెత్తిమీద ఉంది. జయ లీవ్ అని మెయిల్ పెట్టేద్దామనుకొనేసరికి ఫోను మోగింది.

డైరక్టర్ శివగణేష్. "చూడు,జయ సెలవు సంగతి మోర్గాకి తెలియ కూడదు. ఆ పనేదో మీరు సర్దుకోండి. అందుకేగా ఒకరిని ఎక్కువ ఇచ్చాను" అని పెట్టేసాడు.

'ప్రోజక్ట్ లీడర్వి నువ్వే అంటే తెగ సంబర పడ్డాను గానీ చాలా కష్టం, నిజానికి' అనుకొన్నాడు. ఎలాగైనా మిగతా వాళ్లని ఒప్పించి పూర్తి చేయించాలి. అందుకని How to Manage things అనే శిక్షణా తరగతులకి పంపించాడు శివగణేష్. సరే, మేనేజింగ్ స్కిల్స్ వాడి ఆ పని పూర్తి చేయించాలనుకొన్నాడు.

అమెరికా దొంగలకి సంబంధించి సాఫ్ట్వేర్ డెవలప్ చేస్తున్నారు. అమెరికాలో ఒక స్టేషన్లోని దొంగ ఎక్కడ, ఎప్పుడు అరెస్ట్ అయ్యాడు, ఏ కారణం మీదా, సాక్ష్యాధారాలు.. శిక్ష, విడుదల... అతని వ్యక్తి

గత వివరాలు... మొదలైన డేటా అంతా ఎక్కించి ఆ దొంగ పేరు, నంబర్ కొడితే మొత్తం వివరాలు రావాలి. అంతేకాదు కొత్త దొంగ డేటా ఎంట్రీ చేస్తే దానికి యాడ్ అవ్వాలి. దానికి గానూ గంటకి 80 డాలర్లు మిత్రా ఒక్కడి పేరు మీద శివగణేష్ తీసుకొంటాడు. కానీ ఇచ్చేది మాత్రం చాలా తక్కువ. మిత్రాకి ఒకోసారి చాలా కోపం, విసుగు... కానీ తను ఒక్కడూ బయట వుంటే ఒక్క డాలరు కూడా రాదనే నిజం కూడా తెలుసు. అందుకే ఆనందంగా పని చేస్తాడు. ఇదయితే షైక్ వస్తుందని ఆశ....

పది రోజుల్లో ప్రోజక్ట్ టెస్టింగ్‌కి వెళ్తుంది. టెంక్షన్ కానీ ఆందోళన రహితంగా వర్క్ చెయ్యడానికిగానూ వారం శిక్షణ పొందాడు. శిక్షణా తరగతులు గుర్తు చేసుకొంటూ జాగ్రత్తగా పని చేస్తూ, మోర్గా చేత తిట్లు తింటూ, టీమ్‌లో వాళ్లని బ్రతిమలాడు కొంటూనే పూర్తి చేసాడు.

***

ప్రోజక్ట్ సజావుగా లాంచ్ అయింది శివ మిత్ర టీమ్‌కి మంచి ట్రీట్ ఇచ్చాడు. అందరికీ షైక్ ఇచ్చాడు. మిత్రాకి రూ. 28,000 అయింది. చాలా ఆనంద పడ్డాడు. వెంటనే తండ్రి సొంత ఇంటి కల గుర్తుచ్చొంది. ఒకప్పుడు జన ప్రియ అనే కంపెనీ నెలకి 2,000 రూ. కట్టించుకొని ఫ్లాట్స్ ఇస్తామని ప్రకటించింది. మిత్రా తండ్రి పొదుపు చేసి 3 సంవత్సరాలు కట్టాడు. మరో సంవత్సరంలో ఫ్లాట్ రిజిస్టర్ చేస్తాడనుకొంటుంటే వాడు బోర్డు తిప్పేసాడు. అపుడు తండ్రి పడ్డ బాధ, కోర్టు చుట్టూ తిరగడం.... నిరాశ పడడం.. మిత్రా మనసులో ముద్ర పడ్డాయి. అందుకనే ముందు అపార్ట్‌మెంట్ కొందామని చెప్పి లోన్ పెట్టి 10 లక్షలు ఇచ్చాడు. అంతా మెచ్చుకొన్నారు. 25 ఏళ్లు రాకుండానే ఇల్లు కట్టిన అతన్ని అంతా గొప్పగా చూసారు. మిత్రాకి తెలుస్తూనే ఉంది. తల్లి దండ్రులు చాలా అదృష్టవంతులన్నారు. 'మాలాగ నిరుద్యోగ జీవితాలు లేవురా మీకు' అని మేమమావలు భుజం తట్టారు. మనసు నిండి పోయింది ఆనందంతో

శివగణేష్ మిత్రా గృహ ప్రవేశం రోజు అభినందనలు తెలుపుతూ ఫోను చేసాడు. దాంతో ఒక శుభవార్తని చెప్పాడు. పెద్ద ప్రోజక్ట్ వస్తోంది. నువ్వు చాలా లక్కీ అని రేపు 8 గంటలకి రావాలని చెప్పాడు.


మిత్రా రెస్యూమ్‌లో డాట్ నెట్‌లో అతనికి అనుభవం ఆరు సంవత్సరాలన్నట్టుగా చూపించి పంపించాడు శివగణేష్. మిత్రాకి గుండె గుభేలమంది. తనికి రెండు సంవత్సరాలు కూడా లేదు. ఇంత అనుభవం అంటే వాళ్లు చాలా ఎక్స్‌పెక్ట్ చేస్తారు. నెమ్మదిగా శివగణేష్ ఛాంబర్‌కి వెళ్ళాడు. సార్.. అని మాట్లాడబోయే సరికి 5 నిముషాలలో ఇంటర్వ్యూ మొదలవుతుంది. "Be brave and all the best" అన్నాడు. మరేం మాట్లాడనవసం లేదనట్టుగా.

అతని ముఖం చూస్తే గుబులుగా అన్పించింది. ఇది గానీ సరిగ్గా అనకపోతే శివగణేష్ తనని పొమ్మంటాడేమో? ఎందుకంటే ప్రస్తుతం మరీ పెద్ద ప్రోజక్ట్‌లు ఏవీ లేవు. ఇంత జీతం ఇచ్చి తనని చిన్న దానిలో ఉంచాడు.. ఆలోచనలు.. ఆలోచనలు.. ఏదో తెలీని ఆందోళన.. ఒక కప్పు కాఫీ తాగితే బాగుణ్ణు అన్పించింది. టైమ్ గుర్తొచ్చి మానుకొన్నాడు. దగ్గరలో ఉన్న ఫ్రిజ్‌లో నుండి కోక్ తీసి గడ గడా తాగాడు. ఏదో చిన్న మార్పు కావాలి. అంత చల్లనిది తనకు పడదని తెల్సికూడ ఏవి చెయ్యాలో తోచక తాగాడు. టిన్ ఖాళీ అయ్యే సరికి కాల్ వచ్చింది. ''హలో మిత్రా'' అని మొదలెట్టి 40 నిముషాలు సెకను ఖాళీ లేకుండా అడిగాడు. ఇంచు మించుగా ఆన్సర్ చేసాడు. అటువాళ్ల ఉచ్చారణ అర్థం చేసుకోవడానికి, ఇటు సబ్జెక్ట్ వచ్చని ఋజువు చేసుకోవడానికి చూపించిన ఏకాగ్రతకి చాలా అలసిపోయి – అవగానే ఊపిరి తీసుకొన్నట్టు అన్పించింది. రేపు సాయంత్రానికి తెలిసిపోతుంది. పనేం లేక పోయినా ఆఫీస్‌లోనే 8 గంటలూ ఉండాలి. చాలా మందికి ఇంటర్వ్యూ హడావుడి వాళ్లు ప్రోజక్ట్‌లో తీసుకొనేవాళ్లని ఎంచుకొంటారు. అందరికీ ఆందోళనే, శివగణేష్ చూపించిన 25 మందిలో 20 మందిని మాత్రమే తీసుకొన్నారు. మిగతా వాళ్లని ఎంపిక చెయ్యలేదు.


ప్రేమ్ కుమార్ వెంటనే ఫోను చేసి కంగ్రాట్స్ చెప్తూ ''బాసూ, నా సంగతేంటన్నాడు.'' ''ఈ పని కాకపోతే మరొకటి ఉండదా ఏంటి? ఎందుకలావర్రీ అవుతావు!'' అన్నాడు. మిత్రా గొంతులో పలికిన ఈజ్ ప్రేమ్‌కి దొరకలేదు. ప్రేమ్ మనసు చిన్నబోయింది. క్షణం తర్వాత మిత్రాకి ప్రేమ్ స్థానంలో తనుంటే.. అన్పించి గడగడలాడాడు. ప్రేమ్ తండ్రి బాగా డబ్బున్న వాడు కాబట్టి కొంత ఫరవాలేదు.... అని మిత్రా సరి పెట్టుకొన్నాడు.

***

మిత్రాకి చాలా కష్టంగా ఉంది. 6 సంవత్సరాలు అనుభవం ఉన్న వాళ్లకి ఇచ్చినట్టే వర్క్ ఇస్తున్నారు. దాంతో 15 గంటలు కూర్చున్నా అవడం లేదు. ఎప్పుడూ



ఆఫీస్ వీడికి, ఇల్లు ఎందుకుంటున్నారు అందరూ పెళ్లి చేసుకొంటే వాళావిడతో ఎప్పుడు గడుపుతాడు అని హాస్యాలాడుతున్నారు. పెద్ద కంపెనీ అయితే ఇలా ఉండదని మారిపొమ్మని సలహాలిస్తున్నారు. నిజమేనేమోగానీ వస్తే వెళ్లనా, అక్కడ మాత్రం ఇద్దరి పని ఒక్కని చేత చేయించి 1 1/2 జీతం ఇస్తారని ఏ మాత్రం ఆలోచన ఉన్న వాడికైనా తెలుస్తుంది కదా!... అయినా అసలు మారడం ఎలా? ఇంటర్వ్యూకి వెళ్లడానికి సెలవు ఇవ్వడు కదా! బాధగా మూలిగింది మనసు. I.T. రిక్రూటర్ మదన్ ఫోను తియ్యాలంటే విసుగు పూనా కంపెనీలో మూడు లెవిల్స్‌లో తను ఫోను, నెట్ ద్వారా సెలక్ట్ అయ్యాడు మిత్రా మరో రెండింటికి స్వయంగా వెళ్లాలి. ఎప్పుడు వెయ్యమంటారని మదన్ వారానికి రెండుసార్లయినా చేస్తున్నాడు. సెలవు కోసం ఎంత బ్రతిమలాడినా వొప్పు కోవడం లేదు శివగణేష్. అందుకనే మదన్‌కి ఒక సంవత్సరం ఇక్కడే ఉంటానని, వద్దని చెప్పాడు. ప్రోజక్ట్ అయ్యేదాకా మోరల్ కమిట్‌మెంట్‌తో ఉండాలని నిశ్చయించుకొన్నాడు. మూడు నెలలకి ఒక పద్ధతికి వచ్చింది ప్రోజక్ట్.



***

రోజులాగే మెయిల్‌బాక్స్ తెరిచాడు.. ఆ... అని.. నా దేనా.. అనుకొని తేరిపార చూసాడు. "Project terminated"... ఇదేంటీ? ఏవన్నా తేడాయా అనుకొని గబుక్కున ఆపి మళ్లీ ఓపెన్ చేసాడు. "Project terminateతో"... ఇదేంటీ?.. అయోమయం, గాభరా, మరో ప్రాజెక్ట్‌లో వాళ్లంతా పనిలో మునిగి పోయారు. సముద్రం మధ్యలో నావ పోయిన దిక్కుమాలిన వాడిలా, ఏదో శూన్యంలోకి తోసేసినట్టుగా అన్పించింది. తన టీమ్‌లో వాళ్లంతా కలవరంగా దగ్గరికి వచ్చారు ఏంటిదీ? ''ప్చ్ తెలీదు నైట్ 10 గంటలు దాకా వర్క్ చేసాను.'' ముఖంలో శూన్యం అంటే ఏమిటో మిత్రా ముఖం చూస్తే తెలుస్తుంది. ఒక్కొక్కరూ దగ్గరకి వస్తున్నారు.

అందరికీ ''ప్చ్'' అని ఒకే సమాధానం డీప్ డిప్రెషన్ వచ్చేస్తోంది. ప్రేమ్ కుమార్ వచ్చి ''అంత ముఖం మాడ్చుకోవడం దేనికి? రెస్ట్ తీసుకోక అని అసలు మనమేస్త్రీగాడు (శివగణేష్‌ను మేస్త్రీబాబు అంటారు వాళ్లు) ఒక పెద్దఢాకుగాడు అంత సర్వీసు పెట్టి ఎందుకు పంపాలి?''

వెంటనే మిత్రా ''ష్! పదండి'' అని గబగబా బయటికి వచ్చాడు. టీమ్ అంతా బయటికి వచ్చారు.

''సర్, నేను మిత్రాని ప్రాజెక్ట్...''

''ఆ, తెలిసింది. నేను చెన్నైలో వున్నాను. వచ్చాక చూద్దాం. ఎల్లుండి వస్తా...'' అని శివగణేష్ ఫోన్ కట్ చేశాడు.

''అసలు ఎందుకు ఇలా అయింది. వాళ్ల ప్లేన్ ప్రకారం తూచ తప్పకుండా పూర్తి చేస్తున్నాం. Mitra Our Customer Convinced because of your sweet voice అన్నాడే...'' ఒక్కసారి అందరికీ ఆత్మ న్యూనత వచ్చింది. మనం చేతకాని వాళ్లమన్పించింది. అసలు మిత్రా కాకుండా మరొకరైతే బాగుండేదేమో అన్నారు ఒక రిద్దరు. ఎవ్వరూ మొహమాట పడడంలేదు. ఎవరికితోచినది వాళ్ళు మాట్లాడుతున్నారు. పూర్తిగా వాళ్ల ఉద్యోగం మీదే ఆధారపడిన కుటుంబాలు ఉన్నవారికి మాటరావడం లేదు. ఇంకా అక్కడే వుంటే తన ఆత్మవిశ్వాసం మైనస్‌ల్లోకి వెళ్లిపోతుందన్పించింది. సెలవు పెట్టి ఇంటికి బయల్దేరాడు.

***

అలవాటు ప్రకారం గబగబా మెట్లు ఎక్కబోయాడు. ఫస్ట్‌ఫ్లోర్‌లో ముందు పూలగుత్తులతో పచ్చని మొక్కలతో ఉన్న ఆ ఇల్లు చూడగానే లోన్ గుర్తుకొచ్చింది. గుండె గుభేల్ మంది. పిడికిలి మడిచి బొటన వేలుపైకి తీసి మధ్య వేలు చూపుడువేలు దానికి కలిపి టక్ టక్ మని తలుపు కొడతాడు సున్నితంగా. ఆ శబ్దం ఇంట్లో అందరికీ తెలుసు. అది మిత్రాదని తలుపు తీస్తూనే 'ఎంత అలసిపోతున్నాడో కన్న తండ్రి' అన్నట్టుగా ఆప్యాయతతో తనవాళ్లంతా తడిమే అమ్మచూపులు... 'చిన్న వయస్సులోనే ఇల్లు కొన్నాడని' గొప్పగా ఫీలయ్యే తండ్రి ముఖం, 'ఎమ్‌సెట్ ఏ ర్యాంక్ వచ్చినా పేమెంట్ సీటు ఈ ఊర్లోనే తీసుకొంటానన్నాడు మా అన్న..' అని చెప్పే చెల్లి.... ఒక్కసారి గుండె నీరవడం అంటే ఏమిటో తెలుస్తోంది. ముఖం ఎత్తకుండా తలుపుతీసిన తల్లి ముఖం చూడకుండానే లోపలికి వెళ్లబోయాడు.

''ఏరా జ్వరమా... ఏం వచ్చేసావు?'' అంది. వెంటనే భయంగా చెయ్యి పట్టుకొని చూడబోయింది.

''అబ్బే, ఎండమండిపోతోంది..'' ఎదురుగా అమ్మ ఇష్టదైవం ఫోటో శ్రీరా

ముడు కన్పించాడు. మొదటిసారి దేవుడు గుర్తొచ్చాడు. వెంటనే భద్రాచలం వెళ్తున్నాను. రేపు సెలవు దొరికింది'' అన్నాడు.

''అదేంటిరా, ఇంతసడన్‌గా''

''ఫ్రెండ్స్ వస్తున్నారు..'' అని గబగబా రెండు జతలు బట్టలు పెట్టుకొని బయల్దేరాడు.''

***

శివగణేష్ వచ్చిన వెంటనే ఛాంబర్‌లోకి అడుగు పెట్టాడు మిత్రా. ''సర్, సిన్సియర్‌గా ప్రతి ఒక్కరం చేసాం.''

''చెయ్యలేదని ఎవరన్నారు? ఇలాంటివి మామూలే మాకు వాళ్లకి మనకన్నా తక్కువకి రష్యాలో ఎవరో చేస్తామన్నారు. ప్రోజక్ట్ అటు పంపించేసారు. మూడు నెలలు వరకూ గారంటీ లేదని ముందే చెప్పారు. వదిలేయ్. ఇంకొకటి 15 రోజుల్లో తెలుస్తుంది. అంత వరకూ బెంచ్... తప్పదు. మిమ్మల్ని పోషించక తప్పదు. కానీ నీ టీమ్‌లో చివరి అయిదుగురికి షేక్ హ్యాండ్ ఇవ్వకతప్పదు..''

'అంటే...'

''జయ సెలవులు పెడుతుందని... కిందటినెలే ఇక రావద్దని చెప్పాను. లేకపోతే ఆరుగురు అయ్యేవారు. నువ్వు సాయంత్రంలోపు వాళ్లకి చెప్పాలి.''

''ప్లీజ్ సర్, మీరు చెప్పండి...''

''ఏంటీ, వాళ్ళందరితో నేను మాట్లాడాలా, వాళ్ళు రిక్వెస్ట్ చెయ్యడం.. అబ్బే... నేను చెయ్యను. అది టీమ్ లీడర్ బాధ్యత...'' అని వెళ్ళన్నట్టుగా చూసాడు. మళ్ళీ మాట్లాడబోయే సరికి – ''ప్రోజెక్ట్ వలన మీకిచ్చిన హైక్ ఇక ఇవ్వలేను. సాయంత్రం హైద్రాబాద్ వెళ్తున్నా సబ్బుల కంపెనీ బ్రాంచ్ ఓపెనింగ్.. పనుంది..'' అని రివాల్వింగ్ ఛైర్‌లో వెనక్కి తిరిగాడు.

***

మిత్రా వచ్చేసరికి అందరూ చుట్టూమూగారు. ఉద్యోగాలు తీసేసారని ఎలా చెప్పాలి? లోపలినుండి ఏడుపు తన్నుకొస్తోంది. మనంతట మనం ఉద్యోగం మానేయడం వేరు, వాళ్లు పొమ్మంటే వేరు... అనుకున్నంత తేలిక కాదు.. అని దీర్ఘంగా నిట్టూర్చాడు.

''ఇందులో మన తప్పేం లేదు. ఆమాట ముందు గుర్తుంచుకోండి. ఎవరు తక్కువ డబ్బుకి చేస్తే వాళ్ళకి ఇస్తారు, ఆపద్ధతిలో రష్యా వాళ్ళకి ఇచ్చారు. ఇందులో మనం చేతగాని వాళ్ళం అని అనుకొందుకి లేదు.''

ఆమాట అందరి మనసుకీ హాయిగా అన్పించింది. కాస్త ఊరడిల్లి–

''మనమేం చేస్తాడు?..'' ఆత్రుతగా అడిగారు.

''బెంచ్‌మీద ఉండడమే.. మరో ప్రాజెక్ట్‌లో బెంచ్ మీద ఎంత మంది ఉన్నారని అడిగారట. అసలు ఎవరూ లేరంటే ప్రాజెక్ట్ రాదట. శివగణేష్ మనల్ని బెంచ్ మీద చేపిస్తాడు. పెరిగిన జీతం తగ్గించేసారు. కానీ...''

''ఏంటి, చెప్పు...''

చుట్టూ చూసి ''చేతూ, అనిల్, వినయ్, వెంకటేశ్వర్లు... ఏరి?...'' చివరి అయిదుగురూ లేరు. అక్కడ.

అనిల్ టెన్నిస్‌కి వెళ్ళాడు. లీవ్ కూడా పెట్టలేదు. వినయ్ ఐ.టి. రిక్రూటర్ మదన్ దగ్గరికి వెళ్లాడు. మరొకటి వెతుక్కుంటాడుట. చేతూకే బాధ. మూడు నెలలు కూడా అవలేదు. జాబ్ వచ్చినందుకు మా బంధుజనాలకి పార్టీలే పూర్తవ్వలేదన్నాడు. వాడికి చాలా అవసరం కూడా. వాళ్ళ డాడీ ఏక్సిడెంట్‌లో పోవడమే పెద్ద దెబ్బ అయితే.... ఇప్పుడు బెంచ్...

''వాళ్ళు అయిదుగుర్నీ వెళ్ళి పొమన్నాడు నేనే చెప్పాలిట.. ఎలా చెప్పాలి...''

''అమెరికాలో అయితే చాలా లైట్‌గా తీసుకొంటారుట. మనకి అలవాటవలేదు..'' అన్నారు ఒకరు.

''సొమ్ములుంటే ఎవ్వడైనా లైట్‌గానే తీసుకొంటాడని ఎలా చెప్పాలి?'' అన్నాడు దిగులుగా మిత్రా.

''మెయిల్ పెట్టేయ్. లాస్ట్‌మెయిల్ from this company అని ఏం చేస్తాం తప్పదుగా'' అన్నారు. అంతే.

పరిస్థితి అనుభవంలోకి రానప్పుడు మాట్లాడే అంతతేలిక కాదు, అనుభవంలోకి వచ్చినపుడు ఎదుర్కోవడమన్పించింది. పొద్దున్న దాకా తనను పొమ్మంటాడేమోనని ఎంత ఆందోళన వచ్చింది? 'అమెరికన్స్ వీకెండ్ హాయిగా ఎంజోయ్ చేస్తారు. మనకే వచ్చిన ప్రతి పైసా దాచేద్దామనే తాపత్రయం మిత్రా పిసినిగొట్టుతనం తగ్గించుకోరా ప్రతి దానికీ అంత డబ్బే మా నాన్నగారు ఒప్పుకోరు అంటావ్..' అని వెక్కిరించే స్నేహితులు గుర్తొచ్చారు. నాన్న మనీ మేనేజ్‌మెంట్ వలన బ్యాంక్‌లో కాస్త డబ్బు కనబడుతోంది. రెండు మూడు నెలలు ఉద్యోగం వచ్చే లోపు ఇంటి అప్పు తీర్చవచ్చు. అప్పుడే ఫోను మోగింది. సెల్‌ఫోను తీసుకుంటూ – 15,000 రూ. ఖరీదు, ఇది. నాన్న ఎందుకురా అంత ఖరీదు అన్నా తను వినలేదు. మనసు బాధగా మూల్గింది. 23 ఏళ్ల వయసుకే ఇంటి గలవాడయి పోయేడని మురిసి పోయే అమ్మకి.. ఈ 23 ఏళ్ళ వయసు ఆందోళన తెలిస్తే తట్టుకోలేదు.. అనుకొంటూ హలో అన్నాడు.

ఐ.టి. రిక్రూటర్ మదన్ ''బాసూ! సారీ తెలిసింది. మద్రాస్ ఇంటర్వ్యూకి ఏర్పాటు చెయ్యనా! ఫోనులో అయిందిగా మూడు నెలలలోపు ఎప్పుడు వచ్చినా ఏర్పాటు చేస్తామన్నారు. ఊ, అంటే నీకు మంచిది. నాకూ మంచిది. డేట్ చెప్పు'' అన్నాడు.

మదన్ మంచి మాటకారి ఎవరి తరపునైనా తను నిర్ణయం తీసుకొని వాళ్ల చేత అవునన్పిస్తాడు. అందుకే ఐ.టి. రిక్రూటర్ అయ్యాడు.

"Next Tues day... ఫిక్స్ చెయ్యనా?

''ఊహూ ఫ్రైడే కాస్త ప్రిపేర్ అవ్వాలి గదా!''

"On good luck..." అన్నాడు.

***

బెంచ్ మీదున్న వాళ్లు డిప్రెషన్‌కి గురయి పని లేక కంపెనీ గురించి చెడుగా మాట్లాడే అవకాశం ఉందని శివగణేష్‌కి తెలుసు. అందుకే హెచ్. ఆర్ డిపార్ట్‌మెంట్ వాళ్లు ఇచ్చే వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులలో రోజూ రెండు గంటలు కూర్చోమంటాడు. అప్పుడప్పుడూ శివగణేష్ క్లాస్ తీసుకొంటాడు. ఇంటర్వ్యూకి బయల్దేరిన మిత్రాకి శివగణేష్ మాటలు గుర్తొచ్చాయి. రైలు మహా వేగంగా వెళ్తున్న శబ్దంలో కూడా శివగణేష్ మాటలు తన చెవుల్లో మారుమోగుతున్నాయి. ''నైపుణ్యాలు పెంచు కోవాలి. ఎప్పుడూ ఇలాగే ఉంటామంటే ఎలా సొసైటీ అవసరాలబట్టీ నైపుణ్యాలని అభివృద్ధి చేసుకోవాలి. వాళ్లకే భవిష్యత్తు...''

నిజమే తను చదివేటపుడు C++ నేర్చుకొన్నాడు. తర్వాత ''జావా'' కి మంచి ఓపెనింగ్, అన్నారు. తర్వాత డాట్‌నెట్ అన్నారు. ఇవి కాస్తా దగ్గరగా నేర్చుగలిగేటట్టుగా ఉన్నాయి కాబట్టి నేర్చుకోగలిగి శివగణేష్ సబ్బుల కంపెనీ, బట్టల దుకాణం పెట్టగలిగాడు. కానీ అందులో ఏ నైపుణ్యాలు తను చూపగలడు? దానికి కావలసిన సాఫ్ట్‌వేర్ ప్రపంచమందరికీ తెలిసింది. ప్రోగ్రామ్ డెవలప్‌మెంట్ అవసరమే ముంది? అసలు వ్యక్తి జీవితంలో ఎన్ని నైపుణ్యాలు గబగబా అలవర్చుకోగలడు.. అమ్మో... ఇవేం ఆలోచనలు అనుకొని మళ్లీ ఇంటర్వ్యూ టెక్నిక్స్ అని చేతిలో ఉన్న కాగితాలవైపు దృష్టి సారించాడు.

***

కొత్త కంపెనీ చాలా పెద్దది. పెట్టి 15 సంవత్సరాలైంది. ఐ.టి.లో పూర్వం వున్న అంత జీతాలు లేవు అనేది సత్యమని చెప్తూ 20,000 మిత్రాకి ఇస్తామన్నారు. నెల జీతం తగ్గింది. అయితే 8 గంటలు దాటి పనిచేయనక్కరలేదు. ఒకవేళ చేసినా ఎందుకు చేస్తున్నారో సంజాయిషీ ఇవ్వాలన్నారు. జీతం తక్కువైనా జీవితం ఉంటుందన్పించి మిత్రా మారిపోయాడు. మూడు నెలలు ట్రయినింగ్ హుషార్‌గానే ఉంది. చేరిన నెల రోజులకే ఐ.టి. సంక్షోభం, అమెరికా ఆర్థిక మాంద్యం గాభరా మొదలైంది. కానీ మొదటి సారంత లేదు. కానీ కొద్దిగా భయం నేరుగా వెళ్లి డైరక్టర్‌ని సూటిగా అడిగాడు. మా ఉద్యోగాలుంటాయా? అని, '5 సంవత్సరాల వరకూ మీ అవసరం వుంటుందంటేనే మేము ఉద్యోగమిస్తాం నథింగ్ టూ వర్రీ' అన్నాడు. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకొని కంప్యూటర్ దగ్గరికి వెళ్లేసరికి మదన్ నుండి మెయిల్ వచ్చింది. తను ఫోను కట్ చేస్తున్నాడని మెయిల్ ఇచ్చాడు. గోవా కంపెనీకి రెస్యూమ్ పంపించనా... అని మిత్రా తక్కువ జీతానికి వెళ్లాడని – మిత్రా కన్నా మదన్ ఎక్కువ బాధ పడుతున్నాడు. అతడిని మంచి జీతంతో మరో కంపెనీకి త్వరితగతిని మార్చాలని ప్రయత్నం. కానీ మిత్రాకి ఇష్టం లేదు. అందుకనే "I don't want any new job now. our's choice is glittering choice, so this is last mail from Mitra" అని మెయిల్ పెట్టి స్థిమిత పడదామనుకొనే సరికి మదన్ నుండీ మరో మెయిల్ వచ్చింది. "lost my job. so two is last mail from me.." అది చూసి గతుక్కు మన్నాడు మిత్రా.

★

చిరునామా:
ఎ. సీతారత్నం
బి-404, జీవన విశాఖ అపార్ట్‌మెంట్స్,
ఎమ్.ఎమ్.టి.సి.కాలనీ, సీతమ్మ ధార,
విశాఖపట్నం -22.
ఫోన్: 2712179(0891)

